తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : రత్నం నాగరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
మంగళవారం
25 నవంబర్ 2025
సంపుటి 98
సంచిక 3
పేజీలు 8
వెల రూ. 5.00

Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna

## ఇంట్లో అమ్మలా..
# బడిలో అక్షయపాత్ర
- సీఎం రేవంత్ రెడ్డి

- కొడంగల్‌లో హరేకృష్ణ సంస్థ వారి సెంట్రలైజ్ట్ కమ్యూనిటీ కిచెన్ ను పరిశీలించిన సీఎం
- అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిడ్ డే కిచెన్ భవనానికి భూమి పూజ
- 103 కోట్లతో వివిధ అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన
- లబ్దిదారులకు చెక్కులు, చీరల పంపిణీ
- కొండగల్‌ను ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికల ఆవిష్కరణ
- విద్య, నీటి పారుదల రంగం అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కంకణం
- 5 వేల కోట్ల రూపాయలతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మాణం




తరంగాలు, డెస్క్, నవంబర్ 24 : 2034 నాటికి దేశంలోనే ఒక ఆదర్శవంతమైన శాసనసభ నియోజకవర్గంగా కొడంగల్‌ను తీర్చిదిద్దుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. గడిచిన 70 ఏండ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం వచ్చిందని, దేశం నలుమూలల నుంచి ఇక్కడికొచ్చి చూసేలా అభివృద్ధి చేసుకుని ఆదర్శవంతంగా నిలబెడుదామని చెప్పారు. కొడంగల్ నియోజకవర్గంలో సీఎం పర్యటించారు. కొడంగల్‌లో హరేకృష్ణ సంస్థ వారి ఆధునిక అల్పాహార వంటశాల (సెంట్రలైజ్ట్ కమ్యూనిటీ కిచెన్) ను పరిశీలించారు. అనంతరం అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిడ్ డే కిచెన్ భవనానికి భూమి పూజ నిర్వహించారు. ఇదే సందర్భంగా నియోజకవర్గంలో రూ. 103 కోట్లతో వివిధ అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన చేసి సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్దిదారులకు చెక్కులు, చీరలను పంపిణీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ కొండగల్‌ను ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి సంబంధించి ప్రణాళికలను ఆవిష్కరించారు. ఆడబిడ్డలు సంతోషంగా, ప్రశాంతంగా ఉంటేనే రాష్ట్రం ఆర్థికాభివృద్ధి సాధిస్తుందన్న విశ్వాసంతోనే వారిని ఆదుకోవడానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి ప్రధానమైన విద్య, నీటి పారుదల రంగం అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. అందుకు కొడంగల్ ఒక ప్రయోగశాలగా ఎంచుకున్నాం. ఇంట్లో అమ్మ ఏ విధంగా ఆలోచన చేస్తుందో, అదే విధంగా అక్షయపాత్ర సహకారంతో నియోజకవర్గంలోని 312 పాఠశాలల్లో చదువుకుంటున్న 28 వేల మంది విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం అల్పాహారం పెడుతున్నాం. ఏ ఒక్క విద్యార్థి ఆకలితో బాధ పడకూడదు. ఆకలితో చదువుపై శ్రద్ధ కోల్పోవద్దని విద్యార్థులకు ఆల్పాహారం పెట్టాలని నిర్ణయించాం. మధ్యాహ్న భోజన పథకం కూడా ప్రవేశపెడుతున్నాం. కొడంగల్ నియోజకవర్గాన్ని ఒక ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చుతున్నాం. మెడికల్ కాలేజీ, వెటర్నరీ, వ్యవసాయ కాలేజీ, పారా మెడికల్, నర్సింగ్ కాలేజీ, ఫిజియో థెరఫీ, ఇంజనీరింగ్ కాలేజీ, ఏటీసీ, జూనియర్, డిగ్రీ కాలేజీలతో పాటు రాష్ట్రంలో ఇప్పటివరకు లేని సైనిక్ స్కూల్‌ను కొడంగల్‌లో ప్రారంభించుకోబోతున్నాం. రేపటి తెలంగాణ పునర్నిర్మాణంలో కొడంగల్ పిల్లలను భాగస్వామ్యం చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. 5 వేల కోట్ల రూపాయలతో ఎడ్యుకేషన్ క్యాంపస్‌ను నిర్మించుకుంటున్నాం. గొప్ప చదువు చదవాలంటే కొడంగల్ వెళ్లే విధంగా తీర్చిదిద్దాలని క్యాంపస్‌ను నిర్మిస్తున్నాం. 16 నెలలు తిరిగే లోపు అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా...

మిగతా.. 2 లో..

## పంచాయతీ ఎన్నికలు..
- ఎన్నికల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ

- పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపిన ప్రభుత్వం
- సర్పంచ్, వార్డు సభ్యుల గెజిట్‌లను ఎన్నికల సంఘానికి పంపించిన ప్రభుత్వం
- పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయం




తరంగాలు, డెస్క్ నవంబర్ 24 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలకు సంసిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘానికి తెలియజేసింది. ఈ మేరకు ఎన్నికల సంఘానికి వివరాలను సమర్పిస్తూ, ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని లేఖలో పేర్కొంది. జిల్లాల కలెక్టర్లు సమర్పించిన సర్పంచ్, వార్డు సభ్యుల గెజిట్‌లను ప్రభుత్వం ఎన్నికల సంఘానికి పంపింది. ప్రస్తుతమున్న రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల కేటాయించడంతో పాటు, లాటరీ పద్ధతిలో మహిళా రిజర్వేషన్లను కూడా ఖరారు చేసింది. ఇదిలా ఉండగా, పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరగాల్సి ఉండగా, ప్రధాన న్యాయమూర్తి సెలవులో ఉండటం వలన విచారణ జరగలేదు. ఈ కేసు మంగళవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా నోటిఫికేషన్ జారీ చేయడానికి సిద్ధంగా ఉంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12,733 పంచాయతీలు, 1,12,288 వార్డులకు మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది.

## ప్రభుత్వ చేతకానితనంతో రూ.3000 కోట్లు ఆగిపోయాయి : డీకే అరుణ

- రెండేళ్లుగా ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇవ్వలేదని అరుణ విమర్శ
- కేంద్ర నిధుల కోసమే పంచాయతీ ఎన్నికల హడావుడి అని ఎద్దేవా
- ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ కార్యకర్తలకే ఇస్తున్నారని ఫైర్

వివరాలు 2 లో..


## వేధిస్తున్న భర్తను చంపేసిన ఇద్దరు భార్యలు!

- భర్త వేధింపులతో విసిగిపోయిన ఇద్దరు భార్యలు
- నిద్రిస్తున్న భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించిన వైనం
- నిజామాబాద్ జిల్లా దేవక్కపేటలో ఘటన
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

తరంగాలు,, డెస్క్ నవంబర్ 24 : నిజామాబాద్ జిల్లాలో ఒక విషాదకర సంఘటన చోటుచేసుకుంది. భీమ్‌గల్ మండలం దేవక్కపేటలో ఇద్దరు భార్యలు కలిసి తమ భర్తను పెట్రోల్ పోసి సజీవదహనం చేశారు. ఈ అమానవీయ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. దేవక్కపేటకు చెందిన మలవత్ మోహన్ (42)కు కవిత, సంగీత అనే ఇద్దరు భార్యలు ఉన్నారు. మోహన్ తరచూ మద్యం సేవించి వచ్చి భార్యలతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి కూడా గొడవపడి, వారిద్దరినీ ఒక గదిలో బంధించాడు. భర్త వేధింపులు భరించలేకపోయిన భార్యలు, అతడిని అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం సోమవారం ఉదయం ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న మోహన్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించారు. మంటల్లో చిక్కుకున్న అతను అక్కడికక్కడే సజీవదహనమయ్యాడు. ఈ ఘాతుకానికి పాల్పడిన అనంతరం నిందితులిద్దరూ అక్కడి నుంచి పరారయ్యారు. మృతుడి సోదరుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.



## కోకాపేటలో ఎకరం భూమి ధర రూ.137 కోట్లు



2 లో..

## జుబ్లీహిల్స్ ఉప ఎన్నిక... జీహెచ్ఎంసీ కార్పొరేటర్లపై కేటీఆర్ ప్రశంసలు



2 లో..

## అర్ధరాత్రి రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లిన సీపీ సజ్జనార్



తరంగాలు, డెస్క్, నవంబర్ 24 : హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదివారం అర్ధరాత్రి నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలువురు రౌడీషీటర్ల నివాసాలకు వెళ్లి పరిశీలించారు. అధికారులను వెంటబెట్టుకుని ఆయన పెట్రోలింగ్ నిర్వహించారు. రాత్రి వేళల్లో తెరిచి ఉన్న దుకాణాల నిర్వాహకులను ఆయన హెచ్చరించారు. పెట్రోలింగ్ సిబ్బంది అప్రమత్తతను తనిఖీ చేసి, గస్తీ పాయింట్లు, స్పందన వేగంపై సమగ్ర పరిశీలన చేశారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు లంగర్ హౌస్, టోలిచౌకి ప్రాంతాల్లో గస్తీ నిర్వహించారు. రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి వారి నేర చరిత్ర, ప్రస్తుత జీవనశైలిపై ఆరా తీశారు. నేర ప్రవృత్తిని మానుకోవాలని ఆయన హెచ్చరించారు.

## పుచ్చ లేచిపోద్ది
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డికి కవిత స్ట్రాంగ్ వార్నింగ్

- నిరంజన్ రెడ్డికి మూడు ఫామ్‌హౌస్‌లు ఉన్నాయని కవిత ఆరోపణ
- ఆయన అవినీతి కేసీఆర్‌కు తెలియదా అని సూటి ప్రశ్న
- హరీశ్ వల్లే నిరంజన్‌పై కాంగ్రెస్ చర్యలు తీసుకోవట్లేదన్న కవిత





2 లో..

# ప్రభుత్వ చేతకానితనంతో రూ.3000 కోట్లు ఆగిపోయాయి : డీకే అరుణ

మొదటిపేజీ తరువాయి..

తరంగాలు, డెస్క్, నవంబర్ 24 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా ప్రజలకు చేసిందేమీ లేదని, అన్ని వర్గాలను మోసం చేసిందని పాలమూరు ఎంపీ డీకే అరుణ తీవ్రంగా విమర్శించారు. సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం కేంద్ర ప్రభుత్వ నిధుల కోసమే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తోందని ఆమె ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ చేతకానితనం వల్లే కేంద్రం నుంచి రావాల్సిన రూ.3000 కోట్ల పంచాయతీ నిధులు ఆగిపోయాయని డీకే అరుణ అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, ఎన్నికలు జరిగినప్పుడే కేంద్రం నేరుగా గ్రామాలకు నిధులు పంపిస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులోనూ పక్షపాతం చూపిస్తున్నారని, కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకే ఇళ్లు ఇస్తున్నారని ఆరోపించారు. ఈ పథకంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిధులు కూడా ఉన్నాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా మండలాలను ఏర్పాటు చేసిందని, జనాభా ప్రాతిపదికన మండలాలను పునర్వ్యవస్థీకరించాలని డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో సరైన ప్రభుత్వ వైద్య సేవలు లేకపోవడం దారుణమన్నారు. చేనేత కార్మికులకు సబ్సిడీ రుణాలు అందించాలని, మహిళల కోసం జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టిందని, ఈ మోసాలకు మహిళలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు నాగురావు నామాజీ, సత్య యాదవ్, రతంగ్, లక్ష్మీకాంత్, కొండయ్య, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పుచ్చ లేచిపోద్ది

## - మాజీ మంత్రి నిరంజన్ రెడ్డికి కవిత స్ట్రాంగ్ వార్నింగ్

మొదటిపేజీ తరువాయి..

తరంగాలు, డెస్క్, నవంబర్ 24 : మాజీ మంత్రి నిరంజన్ రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనను ఉద్దేశించి "పుచ్చువంకాయ, సచ్చు వంకాయ" అంటూ అవమానకరంగా మాట్లాడుతున్నారని, మరోసారి ఇలా పిచ్చిగా మాట్లాడితే "పుచ్చ లేచిపోతుంది" అని ఘాటుగా హెచ్చరించారు. తండ్రి వయసు వారన్న గౌరవంతో ఇన్నాళ్లూ మౌనంగా ఉన్నానని, ఇకపై సహించేది లేదని స్పష్టం చేశారు. 'జాగృతి జనం బాట' కార్యక్రమంలో భాగంగా వనపర్తిలో మీడియాతో మాట్లాడిన కవిత, నిరంజన్ రెడ్డిపై సంచలన అవినీతి ఆరోపణలు చేశారు. ఒక్కసారి మంత్రి అయిన నిరంజన్ రెడ్డి మూడు ఫామ్‌హౌస్‌లు ఎలా కట్టుకున్నారని ప్రశ్నించారు. అందులో అసైన్డ్ భూములు కూడా ఉన్నాయని ఆరోపించారు. కృష్ణా నది కాలువ సైతం ఆయన ఫామ్‌హౌస్ నుంచే వెళ్లేలా మళ్లించుకున్నారని స్థానికులు చెబుతున్నారని అన్నారు. ఈ అవినీతి వ్యవహారాలు కేసీఆర్‌కు తెలియవా? లేక హరీశ్ రావు అడ్డుపడి కేసీఆర్ దృష్టికి వెళ్లకుండా కాపాడారా? అని కవిత నిలదీశారు. నిరంజన్ రెడ్డి అవినీతిపై ఇక్కడి చిన్న పిల్లాడిని అడిగినా చెబుతారని, మీడియా ముఖంగా ఈ విషయాన్ని కేసీఆర్ దృష్టికి తీసుకెళుతున్నానని తెలిపారు. అదే సమయంలో, నిరంజన్ రెడ్డి అవినీతిపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కవిత ప్రశ్నించారు. హరీశ్ రావుకు సన్నిహితుడు కావడం వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను కాపాడుతోందని తాను బలంగా నమ్ముతున్నానని చెప్పారు. బీఆర్ఎస్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసిన కవిత, ఆ పార్టీలో ఉద్యమకారులు ఉండలేక సతవంతమవుతున్నారన్నారు.

# కోకాపేటలో ఎకరం భూమి ధర రూ.137 కోట్లు

మొదటిపేజీ తరువాయి..

తరంగాలు, డెస్క్, నవంబర్ 24 : హైదరాబాద్ నగరంలో భూముల ధరలు మరోసారి ఆకాశాన్నంటాయి. కోకాపేటలోని నియోపొలిస్ ప్రాంతంలో ఎకరం భూమి రికార్డు స్థాయిలో రూ.137.25 కోట్లకు అమ్ముడుపోయింది. సర్వే నెంబర్ 17, 18లలోని భూములకు హెచ్ఎండీఏ అధికారులు వేలం నిర్వహించారు. సర్వే నెంబర్ 17లో 4.59 ఎకరాలు, సర్వే నెంబర్ 18లో 3.51 ఎకరాల భూమి ఉండగా, వేలంలో ఎకరం భూమి రూ.137 కోట్లకు పైగా ధర పలికింది.

హెచ్ఎండీఏ పరిధిలోని ఖరీదైన భూములను ఆన్‌లైన్‌లో వేలం వేయడానికి ప్రభుత్వం నిర్ణయించి నోటిఫికేషన్ జారీ చేసిన విషయం విదితమే. మొత్తం 9.90 ఎకరాలకు గాను రూ.1,355.33 కోట్ల ఆదాయం హెచ్ఎండీఏకు సమకూరింది.

కొద్ది రోజుల క్రితం రాయదుర్గంలోని 7.67 ఎకరాలకు తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ నిర్వహించిన వేలంలో రూ.1,357 కోట్లకు ఒక సంస్థ దక్కించుకుంది. అక్కడ కనీస ధర ఎకరాకు రూ.101 కోట్లుగా నిర్ణయించగా, వేలంలో రూ.177 కోట్లు పలికింది. ఈ నేపథ్యంలో తాజాగా కోకాపేట నియోపొలిస్‌లోని భూములకు ఎకరం కనీస ధర రూ.99 కోట్లు నిర్ణయించగా, రూ.137.25 కోట్లు పలికింది.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

## - జీహెచ్ఎంసీ కార్పొరేటర్లపై కేటీఆర్ ప్రశంసలు

మొదటిపేజీ తరువాయి..



తరంగాలు, డెస్క్, నవంబర్ 24 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో కార్పొరేటర్లు పోరాడిన తీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసించారు. తెలంగాణ భవన్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, కార్పొరేటర్లతో ఆయన సమావేశమయ్యారు. బల్దియా సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, పార్టీ వెంట ఉన్న ప్రతి కార్పొరేటర్‌కు భవిష్యత్తులో మరిన్ని పదవులు వస్తాయని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల పాటు ఎలాంటి అవినీతికి తావులేకుండా పనిచేశారని, కరోనా వంటి తీవ్ర సంక్షోభంలోనూ అద్భుతంగా సేవలందించారని ప్రశంసించారు. ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత కూడా ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడుతున్నారని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కార్పొరేటర్లు అద్భుతంగా పోరాడారని అభినందించారు. పరిశ్రమలకు కేటాయించిన వాటితో పాటు హైదరాబాద్‌లో భూముల అమ్మకంపై జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో నిలదీయాలని కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రభుత్వం వైఫల్యంపై నిలదీయాలని సూచించారు. జీహెచ్ఎంసీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీ అందరినీ గెలిపించుకుంటుందని వారికి కేటీఆర్ భరోసా ఇచ్చారు.

# ఓపెన్ జిమ్ ప్రారంభించిన

## ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటిడిఎ పిఓ రాహుల్





తరంగాలు, భద్రాచలం, నవంబర్ 24 : భద్రాచలం పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కాలేజ్ గ్రౌండ్లో, ఎంపీడీవో ఆఫీస్ వెనుక పల్లె ప్రకృతి వనంలో ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు,ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ ప్రజలు ఆహ్లాదకర వాతావరణంలో వ్యాయామం చేసుకోవడం ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కూడా ఎంతగానో ఉపయోగంగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటిడిఎ పిఓ రాహుల్ చేతుల మీదగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడం జరిగింది. ప్రజలకు ఎంతగానో ఉపయోగమైన ఓపెన్ జీమ్ ప్రారంభించినందుకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు,ఐటిడిఎ పిఓ రాహుల్ ని పట్టణ ప్రముఖులు శాలువాతో సన్మానించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు అవసరమైన నిధులను కేటాయించి భద్రాచలాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుని పలువురు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, పట్టణ ప్రముఖులు,మండల నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీల సీనియర్ నాయకులు, యూత్ నాయకులు పాల్గొన్నారు

# అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలి - ఐటీడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్



తరంగాలు, భద్రాచలం, 24 నవంబర్ : ఐటీడీఏ ద్వారా ప్రవేశపెడుతున్న వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు అందే విధంగా సంబంధిత యూనిట్ అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. సోమవారం నాడు ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో యూనిట్ అధికారుల సమక్షంలో మారుమూల ఆదివాసి ప్రాంతాల నుంచి అర్జీలు సమర్పించడానికి వచ్చిన గిరిజనుల నుండి ఆయన అర్జీలను స్వీకరించి ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత యూనిట్ అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేయాలని అన్నారు. గిరిజన దర్బార్లో వచ్చిన అర్జీలు వ్యక్తిగత సమస్యలు, భూ సమస్యలు, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఆన్లైన్ చేయించుట, పోడు పట్టాల ద్వారా రైతుబంధు రుణం ఇప్పించుట,నిరుపేదలైన గిరిజనులకు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి స్వయం ఉపాధి పథకాలు ఇప్పించుట, దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం అందించుట,పైచదువులు చదవడానికి ఆర్థిక భృతి కల్పించుట,సబ్సిడీ ద్వారా ట్రైకార్ రుణాలు ఇప్పించుట, వ్యవసాయానికి సంబంధించిన కరెంటు, బోరు,మోటారు ఇప్పించుట, ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ఉపాధి పొందడానికి వ్యక్తిగత శిక్షణలు ఇప్పించుట, ఒంటరి మహిళ, వితంతు పెన్షన్లు ఇప్పించుట, ఫాన్సీ, కిరాణా షాపుల రుణం ఇప్పించుట, సోలార్ జలవిద్యుత్ ద్వారా తమ పొలాలలో బోర్ బావులు తవ్వించి కరెంట్ కనెక్షన్ ఇప్పించుట, ఇసుక సొసైటీల సమస్యలు పరిష్కరించుట, గిరిజన గ్రామాలలో రోడ్డు సౌకర్యం కల్పించుట,పంట పొలాలలో త్రీఫేస్ కరెంటు ఇప్పించుట, ఇతర ఆర్థిక ప్రయోజనాల కొరకు గిరిజనులు దరఖాస్తులను సమర్పించారని ఆయన అన్నారు. గిరిజన దర్బార్ లో సమర్పించిన అర్జీలను ప్రత్యేకమైన రిజిస్టర్లో ఆన్లైన్ ద్వారా నమోదు చేసి,అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు విడతల వారీగా సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఆర్ సి ఓ గురుకులం అరుణ కుమారి, ఏడిఎంహెచ్ఓ సైదులు,ఏవో సున్నం రాంబాబు,డి టి ఆర్ ఓ ఎఫ్ ఆర్ లక్ష్మీనారాయణ, ఉద్యానవనాధికారి ఉదయ్ కుమార్, ఏపీవో పవర్ వేణు,పీవిటీజీ అధికారి గన్యా, మేనేజర్ ఆదినారాయణ, హెచ్ఈఓ లింగానాయక్, ఐసిడిఎస్ సూపర్వైజర్ చంద్రకళ, వివిధ శాఖల సిబ్బంది మోహన్, భార్గవి, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట రూరల్ పరిధిలో విచ్చలవిడిగా ఇసుక దందా

## - ఆన్లైన్ ఇసుక అందుబాటులో ఉన్నప్పటికీ రీచ్ పర్మిషన్ లేకుండానే అక్రమ రవాణా..

తరంగాలు, సూర్యాపేట, నవంబర్ 24: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పేరుతో యండ్లపల్లి, టేకుమట్ల, కె.టి. అన్నారం, కాసరబాధ, సర్కిల్ పేట ప్రాంతాల్లో రోజూ ఇసుక తరలింపు కొనసాగుతోంది. ట్రాక్టర్లు, డంపర్లు పెద్ద ఎత్తున తిరుగుతున్నా సంబంధిత అధికారులు ఆపడం లేదని ప్రజల ఆరోపణ. రిపీటెడ్ గా జరుగుతున్న ఈ అక్రమ రవాణాపై రూరల్ పోలీసులు స్పందించకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇసుక దందాను నిలువరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# ఇంట్లో అమ్మలా.. బడిలో అక్షయపాత్ర

## - సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి..

తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేస్తున్నాం. కరువు ప్రాంతంగా ఉన్న కొడంగల్, మక్తల్, నారాయణపేట ప్రాంతాలను కృష్ణా నదీ జలాలతో తడపాలని, ప్రతి ఎకరాకు నీరివ్వాలని, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రారంభించుకోవడమే కాకుండా దాదాపు 5 వేల కోట్ల రూపాయలతో ప్రతి ఎకరాకు నీరివ్వాలని సంకల్పించాం. భూ సేకరణ విషయంలో 95 శాతం రైతులు స్వతంత్రంగా ముందుకొచ్చి ప్రాజెక్టులు కట్టాలని భూములిచ్చారు. రేపు మంత్రివర్గంలో ఆమోదం పొందితే మూడు నెలల్లో పనులు ప్రారంభమవుతాయి. రైతులు అడిగిన ఇండ్లు, నష్టపరిహారం ఇచ్చాం. లగచర్ల, హకీంపేట, పోలెపల్లి ప్రాంతంలో రైతులు ముందుకొచ్చి ఇస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి పరిశ్రమలను స్థాపించి లగచర్ల పారిశ్రామిక వాడను అభివృద్ధి చేస్తున్నాం. కొడంగల్ ఒక గొప్ప పారిశ్రామిక కేంద్రంగా, దేశ రాజధాని ఢిల్లీ పక్కన నొయిడా అభివృద్ధి చెందినట్టుగా, తెలంగాణ నొయిడాగా తీర్చిదిద్ది కొడంగల్‌కు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొస్తాం. ఇక్కడి పిల్లలకు విద్యతో పాటు పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించే ప్రణాళికలు చేస్తున్నాం. ఇక్కడ పరిశ్రమలు అభివృద్ధి చెందాలంటే రైల్వే లైన్ కావాలి. అందుకే వికారాబాద్ %-% కృష్ణా రైల్వే లైన్ (వికారాబాద్, పరిగి కొడంగల్ నారాయణపేట్, మక్తల్) నుంచి కర్నాకట రాష్ట్రానికి రైలు మార్గం కోసం కేంద్ర ప్రభుత్వ ఆమోదమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేశాం. 70 ఏండ్లుగా వత్తులేసుకుని ఎదురుచూస్తున్న రైల్వే లైను పనులు తొందరలోనే మొదలుపెట్టబోతున్నాం. ఇక్కడ ఉన్న సున్నపు గునులను దృష్టిలో పెట్టుకుని కొడంగల్ మండలంలో తొందరలోనే సిమెంట్ పరిశ్రమను పెట్టి ఇక్కడ ఉద్యోగాలు కల్పించబోతున్నాం. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు పంపిణీ చేయడానికి కోటి చీరెలను సారెగా నాణ్యత కలిగిన చీరలను అందిస్తున్నాం. ప్రతి ఆడబిడ్డకు చీర అందాలి. ప్రతి ఆడబిడ్డ ఇంటికెళ్లి చీర అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో బడి, గుడి, తాగడానికి మంచినీరు, ఇందిరమ్మ ఇండ్లు.. కావాలి. ఇలాంటి పనులు చేయాలంటే రాబోయే సర్పంచు ఎన్నికల్లో మంచి వారిని గెలిపించుకోవాలి.. అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని 300 కోట్ల రూపాయల చెక్కును అందించారు. అంతకుముందు మహిళా శక్తి పథకంలో భాగంగా మద్దూరు మండల మహిళా సమాఖ్య సౌజన్యంతో నడపనున్న బస్సుకు ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు.

## గ్రామ పార్టీ అధ్యక్షులు చంద్రయ్య పార్థివా దేహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కడియం



జఫర్గడ్ ప్రతినిధి, నవంబర్ 24,(తరంగాలు): మండలం తమ్మడపల్లి (జి) గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయపర్తి చంద్రయ్య మరణించగా మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆయన పార్థివా దేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. చంద్రయ్య మరణం గ్రామ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేసి చంద్రయ్య పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. ఎమ్మెల్యేవెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య, మోహన్ రావు, కృష్ణమూర్తి, మారాపెల్లి ప్రభాకర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ పనులు ప్రారంభం



జఫర్గడ్ ప్రతినిధి, నవంబర్ 24, (తరంగాలు : తెలంగాణ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి వర్యులు స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి ఆదేశాల మేరకు ఓబులాపురం గ్రామంలోయస్సీపీ నిధుల నుండి5 లక్షల రూపాయలు మంజూరు చేసినసిసిరోడ్లను,ఇందిర మహిళ శక్తి చీరాల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించినపాక్స్ చైర్మన్ తీగల కరుణాకర్ రావు,మాజీ సర్పంచ్ ఓబులాపుర్ గార్లపాటి నీరజ రెడ్డి.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ,మహిళా సంఘం సభ్యులు ,గ్రామ నాయకులు, మాజీ సర్పంచులు,మాజీ ఎంపిటిసిలు, మాజీ వార్డు మెంబర్లు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొనీ ఎమ్మెల్యే కు కృతజ్ఞులు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.



## కలెక్టరేట్ ఎదుట ధర్నాలను విజయవంతం చేయండి



జఫర్గడ్ ప్రతినిధి,నవంబర్ 24,(తరంగాలు) : బుధవారం జనగామ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రకటన విడుదల చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, రైతు సంఘం చట్టాలపై కలెక్టరేట్ గా ఎదుట ధర్నాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వ్యవసాయ వ్యతిరేక చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలు నాలుగింటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని, రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మొండి వ్యవహారంతో కార్మికులను, రైతులను నట్టేట ముంచుతుందని మండిపడ్డారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు సాధించి పోరాటం తెచ్చుకున్న కార్మిక కోడలు రద్దుచేసి, కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన చట్టాలు తేవడం దారుణం అన్నారు. నూతన వ్యవసాయ కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోర్లను వెంటనే రద్దు చేయాలని లేని పక్షంలో కార్మికులు రైతు సంఘాలు సిఐటి సంఘాలు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం సింగపురం ఇమ్మానియేల్ రాజ్



జఫర్గడ్ ప్రతినిధి, నవంబర్ 24,(తరంగాలు) : మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సింగపురం ఇందిరా తనయుడు, యువనాయకులు సింగపురం ఇమ్మానియేల్ రాజ్ అన్నారు. సోమవారం ధర్మసాగర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన మునిగాల ఏలియా ఇంటివల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా అయన చిత్ర పటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబం ఎల్లవేళల అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి మౌనిక , జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు సింగపురం నాగయ్య , ధర్మసాగర్ మండల కోఆర్డినేటర్ బిక్షపతి ,సీనియర్ నాయకులు వక్కల రవి,సేషన్ ఘనపూర్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ సంద్ర సందీప్ , రాంపూర్ గ్రామ కాంగ్రెస్ ఉప అధ్యక్షులు ఆరెపెల్లి పవన్ ,రాంపూర్ గ్రామ నాయకులు మునిగాల ప్రభాకర్ , మునిగాల భిక్షపతీ,సంద్ర కుమార్, మరగోని భిక్షపతీ, మునిగాల సదనందం గౌడ్, కందుకూరి సురేష్,బీసీ సెల్ నాయకులు బాలరాజు , చిల్పురు మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ మణి ,రాజ్ కుమార్, శివరాజు, గణేష్,మండల ఎంపీటీసీల పురం మాజీ అధ్యక్షులు సింగపురం దయాకర్ , మండల కార్యదర్శి నారగొని పద్మ, జాఫర్గడ్ సీనియర్ నాయకులు సాల్మన్ రాజ్ , సింగపురం ప్రతిష్

## లేబర్ కోడ్ ల నోటిఫికేషన్ రద్దుకు ఐక్యంగా ఉద్యమించాలి



నర్సంపేట ఆర్సీ, నవంబర్ 23, తరంగాలు : నర్సంపేట ఎన్నో దశాబ్దాలుగా కార్మికులు తమ రుధిరం చిందించి పోరాడి సాధించుకున్న కార్మికుల చట్టాలను రద్దు చేస్తూ కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, లేబర్ కోడ్ ల నోటిఫికేషన్ రద్దుకు ఐక్యంగా ఉద్యమించాలని వ్యవసాయ మార్కెట్ హమాలి రాష్ట్ర అధ్యక్షులు గుంపెల్లి మునీశ్వర్ పిలుపునిచ్చారు. ఆదివారం నర్సంపేట వ్యవసాయ మార్కెట్ గేటు ముందు ఏఐటీయ- యూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపి, లేబర్ కోడ్ ల నోటిఫికేషన్ పత్రాలను కార్మికులు దగ్ధం చేశా- రు.ఈ సందర్భంగా మునీశ్వర్ మాట్లాడుతూ నూతన లేబర్ కోడ్ లో యూనియన్ లు పెట్టుకోకుండా, సమ్మె హక్కులను కాలరాయడం, పనిగంటలు పెంచడం, మినిమం వేజేస్ నిర్ణయించడంలో యాజమాన్యాల నిర్ణయానికి వదిలేయడం , కార్మిక సంక్షేమం కాలం రాయడం వంటి యాజమాన్య అనుకూల , కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేయడం అంటే పేదలైన బహుజన కార్మికులను ,మనువాద అగ్రకుల పెట్టుబడి దారి కార్పొరేట్ శక్తులకు బానిసలుగా మార్చే కుట్రలో భాగమే అన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను రైతాంగ ఉద్యమం ఎలా ప్రతిఘటించిందో కార్మిక వర్గం కూడా అదే స్ఫూర్తితో ఈ లేబర్ కోడ్ లను రద్దు చేసేదాకా ఐక్యంగా పోరాటాలు చేయాలని, ఏఐటీయూసీ అందుకు చొరవ చూపుతుంటూ కార్మికులకు పిలుపిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు ఇల్లందుల సాంబయ్య, బొల్లం ప్రసాద్, వ్యవసాయ మార్కెట్ హమాలి సంఘం పిడుగు మొగిళి, అడుప కుమారస్వామి, వైనాల సాయిలు, ఎలబోయిన రవి, ఓదెల కనకమల్లు, ముస్కు కుమార్, చిన్నాల సారంగం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఐలయ్య సేవలు విశేషమైనవి
### - ఆబోతు రాజు యాదవ్



నర్సంపేట నవంబర్ 24 తరంగాలు : పోలీసు శాఖలో గత 40 ఏళ్లుగా గన్నారపు మల్లయ్య అందించిన సేవలు విశేషమైనవని బిసి పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్ కొనియాడారు గన్నారపు ఐలయ్య పదవి విరమణ మరియు జన్మ దినోత్సవ వేడుకలను పట్టణంలోని తమ నివాసంలో కుటుంబ సభ్యుల సమక్షంలో సోమవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆబోతు రాజు యాదవ్ మాట్లాడుతూ ఐలయ్య పుట్టినరోజు శుభాకాంక్షలు తో పాటు పదవీ విరమణ అభినందనలు తెలిపారు సుమారు 40 సంవత్సరాల పాటు పోలీస్ శాఖలో సేవలందించిన ఐలయ్య సేవలు విశేషమైనవని ఆయన పని చేసిన ప్రతి పోలీస్ స్టేషన్ లోనూ సహోద్యోగుల ప్రేమాభిమానాలు పొందారని సహ హోంగార్డులు ఆయనకు ఒక కుటుంబ సభ్యుడిగా భావిస్తూ ఐలయ్య స్వభావం సేవ భావం అందరికీ ఆదర్శమని ప్రశంసించారు ఈ కార్యక్రమంలో ఐలయ్య పెద్ద కుమారుడు గన్నారపు జగన్ చిన్న కుమారుడు క్రాంతి కుమార్ కూతురు సునంద యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సంగినేని లకన్ హోంగార్డుల బృందం పైండ్ల ఆగయ్య రవి సుధాకర్ రాంబాబు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి
### - కేంద్ర ఖాదీ,చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం





వర్ధన్నపేట ప్రతినిధి, నవంబర్ 24,తరంగాలు : క్రీడలు శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని కేంద్ర ఖాదీ,చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు.సోమవారం వర్ధన్నపేట మండలం కేంద్రంలో పద్మశాలి యువజన సంఘం టౌన్ ప్రెసిడెంట్ పెద్దూరి రాజ్ కుమార్, చెన్న శ్రీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షటిల్ కోర్టు ను కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని తెలిపారు.ఇటువంటి క్రీడ కార్యక్రమాలు మన ప్రాంతంలో ఎక్కడ నిర్వహించినా తన వంతు కృషి చేస్తారని ఈ సందర్భంగా వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిలివేరు కుమారస్వామి, పెద్దూరి సంజీవ రావు, తుమ్మల యాకయ్య,గోశాల అనిల్, సంకినేని వెంకట్, దర్గయ్య, సారంగపాణి, జనార్ధన్, పాశికంటి రాంచందర్, గోక శ్రీనివాస్, సిలివేరు రాజ్ కుమార్, చిప్ప వెంకటేశ్వర్లు, చిదిరాల కేదారి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం

## - ఎమ్మెల్యే డా.మురళి నాయక్

- ప్రతీ పని, ప్రతీ పథకానికి మహిళల పేరు మీదనే అమలు...
- కోటి మంది మహిళలకు ఒకే రకమైన చీరలు...
- 18ఏళ్ళు నిండిన ప్రతీ మహిళకు చీరలు పంపిణీ చేస్తాం
- మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత
- మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబం అభివృద్ధి చెందుతుంది
- గత ప్రభుత్వం ఇచ్చిన చీరలను పొలాల్లో దిష్టి బొమ్మలకు కట్టే వారు
- కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు నాణ్యమైన చీరలను అందిస్తుంది







కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి,నవంబర్.24, తరంగాలు : మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ.మహిళల ఆత్మగౌరవాన్ని నిలిపేలా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ చీరల పంపిణీ నిర్వహిస్తోందని మహబూబాబాద్ శాసనసభ్యులు డా భూక్యా మురళీ నాయక్ అన్నారు.సోమవారం కేసముద్రం పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో కేసముద్రం మండల మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణి కార్యక్రమానికి మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. మురళీ నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మహిళల అభ్యున్నతికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కోటి మంది మహిళలకు కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ పంపులు మరియు ఆగ్రో రంగాలలో మహిళలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా మురళీ నాయక్ మాట్లాడుతూ...గత ప్రభుత్వం ఇచ్చిన చీరలను పొలాల్లో దిష్టి బొమ్మలకు కట్టే వారాన్నారు. మహిళల ఆత్మ గౌరవాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈసారి నాణ్యమైన చీరలను అందిస్తుందన్నారు. మహిళల సామాజిక-ఆర్థిక శక్తివంతత కోసం ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రతి పథకం మహిళల జీవితాల్లో స్థిరమైన మార్పు తీసుకువస్తోందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబం అభివృద్ధి చెందుతుందని, కుటుంబం అభివృద్ధి చెందితే సమాజం సుసంపన్నమవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళలు విద్య, ఉపాధి, వ్యాపార రంగాల్లో ముందుకు రావడానికి ప్రభుత్వం అవసరమైన సదుపాయాలన్నీ అందిస్తున్నదని అన్నారు. మహిళల ఆరోగ్య భద్రత, ఆర్థిక భద్రత, స్వయం ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టితో ఇందిరమ్మ రాజ్యం పనిచేస్తోందని తెలిపారు.ఈ చీరల పంపిణీ కేవలం ఒక పథకం మాత్రమే కాదు, మహిళల పట్ల ప్రభుత్వ మనసులోని గౌరవానికి ప్రతీక అని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు, మాజీ జడ్పిటిసి బండారి వెంకన్న, ఆర్టీవో నెంబర్ రావుల మురళీ, మాజీ పీసీసీ సభ్యులు దాస్రు నాయక్, డిప్యూటీ తాహసిల్దార్ ఎర్రయ్య, ఎంపీడీవో క్రాంతి, ఏవో కృష్ణమూర్తి,జిల్లా నాయకులు, మండల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రయ్య పార్థివ దేహానికి నివాళులు అర్పించిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య



జఫర్గడ్ ప్రతినిధి, నవంబర్ 24,(తరంగాలు) : మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామం లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయపర్తి చంద్రయ్య మరణించినందున రాయపర్తి చంద్రయ్య పార్థివ దేహాన్ని స్టేషన్ ఘనపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు.వారి తో పాటు అందుబాటులో ఉన్న ప్రజా ప్రతినిదులు , ముఖ్య నాయకులు మరియు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం..

## - ఏఎంసీచైర్మన్ గంట సంజీవరెడ్డి



కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్.24, తరంగాలు : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని కేసముద్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి అన్నారు. సోమవారం నాడు మండలంలోని కల్వల గ్రామంలో ఇద్దరమ్మా చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సీఎం రేవంత్ రెడ్డి మహిళల కోసం అనేక రకాల కార్యక్రమాలు చేపడుతున్నారని, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డులు, మహిళలకు ఏకరూప దుస్తుల పంపిణీ కుల మతాలకు అతీతంగా అందరూ సమానంగా ఉండాలని ఉద్దేశంతో ఒకే రకమైన చీరలను రాష్ట్ర ప్రభుత్వం అందించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఏ మెంబర్ రావుల మురళి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గండి శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ బండారు నరేందర్, బొడ్డు బిక్షం, జయేందర్, చంద్రం, ఐకెపి వివోఏలు మందాటి కళావతి, జల్లె రజిత, మూల లావణ్య, గ్రామైక్య సంఘం బాధ్యులు లింగాల కవిత, బోగోజు శిరీష, పూన పద్మ,మహిళా సంఘం బాధ్యులు ప్రమీల, పద్మ, శ్రీదేవి తదితరులు మహిళలు పాల్గొన్నారు.

# ఎంపీ కడియం కావ్యను కలిసిన నూతన డిసిసి అధ్యక్షులు








వరంగల్ ప్రతినిధి, నవంబర్ 24,తరంగాలు : వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ను, నూతనంగా ఎన్నికైన హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య నూతన డిసిసి అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు. హన్మకొండ, వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ నూతన డీసీసీ నాయకత్వం పార్టీ ఆదర్శాలు, ప్రజా సమస్యలపై మరింత చురుకుగా పనిచేయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో మరింత విశ్వాసాన్ని నెలకొల్పే బాధ్యత ఇప్పుడు తమపై ఉందన్నారు. హన్మకొండ, వరంగల్ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమం,సేవ అనే మూడు స్తంభాలపైనే పార్టీ బలోపేతం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజల అంచనాలకు అనుగుణంగా పనిచేస్తే కాంగ్రెస్‌కు మరింత ప్రజాభిమానాన్ని అందించడం ఖాయం అన్నారు. గ్రామీణ స్థాయి నుండి బూత్ స్థాయికి వరకు ప్రతి కార్యకర్తను కలుపుకొని ముందుకు సాగాలని, ప్రజల్లో కనిపించే చిన్న సమస్య కూడ వినిపించేలా వ్యవస్థను బలపరచాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు గడ్డకట్టిన వ్యవస్థలకు కొత్త ఊపిరి పోసినట్టేనని, ఈ సంక్షేమం ప్రజల దాకా చేరే విధంగా డీసీసీ నాయకత్వం పటిష్టంగా పని చేయాలని కోరారు. పార్టీ బలోపేతం కోసం కోఆర్డినేషన్, క్రమశిక్షణ, కృషి అనే మూడు అంశాలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని ఎంపీ ఆకాంక్షించారు.

# దశదిన కర్మలో పాల్గొన్న రాణా ప్రతాప్



నర్సంపేట నవంబర్ 24 తరంగాలు: నర్సంపేట నియోజకవర్గం లోని నెక్కొండ మండల పార్టీ అధ్యక్షుడు నాయిని అశోక్ అనూష నానమ్మ నాయిని మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా సోమవారం జరిగిన దశదిన కార్యక్రమానికి వరంగల్ బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి హాజరై మల్లమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు ఈ కార్యక్రమంలో నర్సంపేట పట్టణ పార్టీ అధ్యక్షుడు గూడూరు సందీప్ జిల్లా నాయకులు గుడిపూడి రాధాకృష్ణ ఆబోతు రాజు యాక సాయన్న అచ్చ దయాకర్ తాళ్లపల్లి రాము కొంకిస విగ్నేష్ జూలూరి మనీష్ భానోత్ రమేష్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన రాణా ప్రతాప్



నర్సంపేట నవంబర్ 24 తరంగాలు : దుగ్గొండి మండలం బలవంతపురం గ్రామానికి చెందిన కొత్తపెల్లి సుశీల ఐలయ్య దంపతుల కుమారుడు ప్రశాంత్ సిరి చందన ల వివాహానికి బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి సోమవారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నేదురు రాజేందర్ నర్సంపేట పట్టణ పార్టీ అధ్యక్షుడు గూడూరు సందీప్ జిల్లా కౌన్సిల్ మెంబర్లు చెల్పూరి రాజు పొదిల రామచందర్ ప్రధాన కార్యదర్శిలు చిరంజీవి కొండపాక మధు సూత్రపు సరిత తాళ్ల పెల్లి రాము పొగాకు విగ్నేష్ సకినాల నరేష్ కడివెండి లింగాచారి దూడాలు ముప్పారపు జగదీష్ ఉసారి నరేష్ బానోతు రమేష్ పాలకొండ శ్రీను తిక్క పవన్ బూర్గుల మల్లారావు బూర్గుల చిరంజీవి బూర్గుల మల్లారావు కొనకటి శేఖర్ అనుముల దిలీప్ సకినాల అఖిల్ కొత్తపల్లి రాజుతోపాటు తదితరులు ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్



కల్వకుర్తి,నవంబర్ 24, తరంగాలు ప్రతినిధి : కల్వకుర్తి నియోజకవర్గంలోని తోటపల్లి గ్రామం అయిలా దశరథం అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయాన్ని గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతుడి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ కుకృతజ్ఞతలుతెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కంపీల్లా భీం, మాజీ ఎంపిటిసి రవీందర్ రెడ్డి, ఈశ్వరయ్య, వెంకటయ్య, మల్లేష్, సంజీవ్, పరిశరాములు, సత్యనారాయణ, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు

## ఇందిర మహిళ శక్తి చీరల పంపిణీ



జఫర్గడ్ ప్రతినిధి, నవంబర్ 24,(తరంగాలు) : మండలం లోని కూనూరు గ్రామపంచాయతీలో ఇందిర మహిళ శక్తి చీరల పంపిణీ మహిళా సంఘం వి ఓ లు పద్మ,హేమలత,పంచాయతీ కార్యదర్శి గర్వందుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో మహిళా సంఘా సభ్యులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సంధ్యా శ్రీనివాస్, మాజీ సర్పంచులు గడ్డం లత ధనుంజయ్, కాటం దేవేంద్ర,, మాజీ వార్డ్ మెంబర్లు సురేష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాట్ల అశోక్, నాయకులు సమ్మిరెడ్డి, కాటం రాజిరెడ్డి, మల్లారెడ్డి ,అజయ్ కుమార్,బాబు, నవీన్,ఐలయ్య పాల్గొన్నారు.

## మల్టీ పర్పస్ ప్రాథమిక సహకార సొసైటీల ద్వారా రైతులకు,ప్రజలకు సేవలు అందించాలి

### - జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్,ప్రతినిధి, నవంబర్.24,తరంగాలు : జిల్లాలో మల్టీ పర్పస్ ప్రాథమిక సహకార సొసైటీల ద్వారా రైతులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్.సోమవారం మహబూబాబాద్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దంతాలపల్లి, పెద్ద వంగర, కంబాలపల్లి, అప్పారాజుపల్లి, గంగారం లలో నూతన సొసైటీ ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందని, రాష్ట్రస్థాయి కమిటీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం (3) సొసైటీలకు ఆమోదం తెలిపి ఒక సొసైటీ కొరకు ప్రాథమిక సహకార సంఘ సభ్యుల కమిటీ ద్వారా క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించాలని సూచించారు. ఈ మల్టీపర్పస్ సహకార అభివృద్ధి సొసైటీల ద్వారా రైతులకు,ప్రజలకు యూరియా, ఫెర్టిలైజర్స్, వ్యవసాయ, తదితర సేవలు అందించడం జరుగుతుందని రైతులకు త్వరగా క్షేత్రస్థాయిలో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఉపయోగపడతాయని అన్నారు. మిగతా సొసైటీల ఎంపిక ప్రభుత్వం సూచించిన జాయింట్ కమిషన్ ద్వారా చర్యలు తీసుకొని ప్రతిపాదించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)అనిల్ కుమార్,జిల్లా సహకార అధికారి వెంకటేశ్వర్లు, జెడ్పి సీఈవో పురుషోత్తం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి విజయనిర్మల, డిసిసిబి సీఈఓ వజీర్ సుల్తాన్, జిల్లా పశు వైద్య అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, ఫిషరీస్ జిల్లా అధికారి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను మోసం చేసిన రేవంత్ ప్రభుత్వం పెద్ది సుదర్శన్ రెడ్డి మండిపాటు



నర్సంపేట నవంబర్ 24 తరంగాలు: రాష్ట్రంలోని మహిళలకు గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మండిపడ్డారు సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పేరు మీద మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం చేస్తోందని ఇది కేవలం మహిళ స్వయం సహాయక గ్రూపులలో సభ్యులుగా ఉన్న మహిళలకు మాత్రమే చీరలు అందిస్తుందని గతంలో కేసీఆర్ ప్రభుత్వం 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఆంక్షలు లేకుండా ప్రతి సంవత్సరం బతుకమ్మ పండుగకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అనేక ఆంక్షలతో మహిళలందరికీ చీరలు ఇవ్వకుండా రెండు సంవత్సరాల పాటు బతుకమ్మ పండుగకు ఇవ్వాల్సిన చీరలు కూడా ఇవ్వలేదని అన్నారు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు మ్యానిఫెస్టోలో మహిళలకు మహాలక్ష్మి పథకం పేరు మీద అనేక రకాలైన హామీలు ఇచ్చిందని ప్రతి మహిళకు నెలకు 2500 ఇస్తామని ప్రతి విద్యార్థినికి స్కూటీ ఇస్తామని పెళ్లి కానుకగా తులం బంగారం ఇస్తామని ఎన్నో హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీని కూడా సంపూర్ణంగా నెరవేర్చలేదని అన్నారు. కుటుంబంలో ఎంతమంది 18 సంవత్సరాలు దాటిన మహిళలు ఉంటే అంతమందికి నెలకు 2500 చొప్పున పెన్షన్ తో పాటు వృద్ధులకు 4000 పెన్షన్ ఇస్తానని బూటకపు హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు కేవలం తోతూ మంత్రంగా కొంతమందికే ఇస్తూ చేతులు దులుపుకుంటు ందని అన్నారు మహిళలకు గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో అనేక హామీలు ఇచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న ఏ ఒక్క హామీని కూడా సంపూర్ణంగా నెరవేర్చకుండా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలంతా బుద్ధి చెప్పాలని పెద్ది సుదర్శన్ రెడ్డి కోరారు.

## నేడు పండుగ వాతావరణంలో వడ్డీ లేని రుణాల పంపిణీ

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం



వరంగల్ ప్రతినిధి, 24 నవంబర్, తరంగాలు : జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో మంగళవారం స్వయం సహాయక మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అన్ని సెగ్మెంట్లలో ఏకకాలంలో పండుగ వాతావరణంలో జరిగేలా విస్తృత ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం సచివాలయం నుండి మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సెర్ప్ సీ.ఈ.ఓ దివ్య దేవరాజన్ తదితరులతో కలిసి ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ఇందిరమ్మ చీరల పంపిణీ, వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ నెల 25వ తేదీన (మంగళవారం) అన్ని సెగ్మెంట్లలో వడ్డీ లేని రుణాల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి, వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఘనంగా ఏర్పాట్లు చేయాలని, మంత్రివర్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని వారికి ముందుగానే సమాచారం అందించాలని సూచించారు.

జిల్లాలోని ఆయా నియోజకవర్గాలలో గల 10 వేల 357 స్వయం సహాయక సంఘాలకు రూ. 6 కోట్ల 52 లక్షల వడ్డీ లేని రుణాల కింద పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కార్యోన్ముఖులను చేశారు. నియోజకవర్గ స్థాయిలో చేపట్టే ఈ కార్యక్రమంలో మండల, గ్రామ మహిళా సమాఖ్యల ప్రతినిధులు అందరూ హాజరయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ, ఇంచార్జి డీ.ఆర్.డీ.ఓ రామిరెడ్డి,జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు ఉమా, రాధిక ఐ.కె.పీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మేడపల్లి,గొల్లపల్లి పాఠశాలల్లో కిశోర రక్ష ఆరోగ్య పరీక్షలు

## - మేడపల్లి వైద్యాధికారి డాక్టర్ జ్యోతి



నల్లబెల్లి, నవంబర్ 24: తరంగాలు : నల్లబెల్లి మండలం మేడపల్లి జెడ్పిహెచ్ఎస్ మరియు ఎంపిపిఎస్ గొల్లపల్లి పాఠశాలల్లో సోమవారం మేడపల్లి వైద్యాధికారి డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో కిషోర రక్ష కార్యక్రమం కింద సమగ్ర ఆరోగ్య పరీక్షలను వైద్య విభాగం విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 120 మంది విద్యార్థుల్లో 85 మందికి జనరల్ హెల్త్ స్క్రీనింగ్, బ్లడ్ గ్రూపింగ్, హీమోగ్లోబిన్ పరీక్షలు, విజన్ టెస్టింగ్ వంటి సేవలను అందించాము. 35 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కిషోర వయసు పిల్లల్లో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స, పోషకాహార సలహాలు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై అవగాహన పెంచే దిశగా ఇలాంటి కార్యక్రమాలు మరింత బలోపేతం చేయనున్నట్లు డాక్టర్ జ్యోతి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, హెల్త్ ఎడ్యుకేటర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# నేడు మహిళలకు వడ్డీలేని రుణాల పంపిణీ

- అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలి
- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క





హన్మకొండ ప్రతినిధి,నవంబర్ 24,తరంగాలు: రాష్ట్రవ్యాప్తంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీని మంగళవారం ఏకకాలంలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంత్రి సీతక్క, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, ఇతర అధికారులతో సోమవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్ లతో హైదరాబాద్ నుండి డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మహిళలకు వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమానికి అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో ఘనంగా ఏర్పాట్లు చేయాలని, మంత్రులు, ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుని వారికి ముందుగానే సమాచారం అందించాలని ఆయన ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్‌లను ఆదేశించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో జరుగుతున్న వడ్డీ లేని రుణ పంపిణీ కార్యక్రమానికి మండల సమాఖ్యలు, గ్రామ సమాఖ్యల నాయకులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే దానిని పెద్ద ఎత్తున పునరుద్ధరించిందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. దీని వల్ల రాష్ట్రవ్యాప్తంగా మహిళల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యాన్ని తెచ్చిపెట్టిందని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రెండు, మూడు దశల్లో వడ్డీ లేని రుణాలు ఇప్పటికే పంపిణీ చేశామని, 25, 26వ తేదీల్లో మహిళా సంఘాలకు పెద్ద ఎత్తున రుణాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు చీరల పంపిణీ కార్యక్రమాన్ని అద్భుతంగా అమలు చేసినందుకు డిప్యూటీ సీఎం ప్రశంసలు తెలిపారు. ఇందిరమ్మ చీరల గురించి మహిళల నుండి ప్రతి మండలం నుండి తమకు సానుకూల నివేదికలు వచ్చాయని ఆయన అన్నారు. ఆకర్షణీయమైన డిజైన్లతో కూడిన అధిక నాణ్యత గల చీరలు లభించడం పట్ల మహిళలు ఎంతో సంతోషం వ్యక్తం చేశారన్నారు. ప్రత్యేక శ్రద్ధ, సమన్వయంతో ప్రతి గ్రామానికి ఇందిరమ్మ చీరలను విజయవంతంగా పంపిణీ చేసినందుకు అన్ని జిల్లా కలెక్టర్లను అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల లో మహిళలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ కార్యక్రమానికి జిల్లాల కలెక్టర్లు ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాల అకౌంట్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 304 కోట్లను ఈరోజే జమ చేసిందన్నారు. హైదరాబాద్ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అడిగిన వివరాలకు హనుమకొండ జిల్లా కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి హనుమకొండ జిల్లాకు సంబంధించి 2బిహెచ్ కె, ఇందిరమ్మ ఇండ్ల వివరాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తెలియజేశారు. జిల్లాలోని న్యూశాయంపేట, కమలాపూర్ లలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో రెండువేల ఎనిమిది వందల ఇండ్లను మంజూరు చేసామని, ఇందులో పదిహేడు వందలు చేశామని, మిగతా వారు ఇండ్లు నిర్మించుకోవడానికి సిద్ధంగా లేమని ఇచ్చారని, వారి స్థానంలో ప్రత్యామ్నాయ అర్హుల జాబితాను గుర్తిస్తున్నట్లు సీఎస్ రామకృష్ణారావు కు కలెక్టర్ తెలియజేశారు.

### వడ్డీ లేని రుణాల పంపిణీ కి ఏర్పాట్లు

హనుమకొండ జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు అధికారులు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. హనుమకొండ జిల్లాకు సంబంధించి 12 మండలాలకు చెందిన 9046 మహిళా స్వయం సహాయక సంఘాలకు 6కోట్ల 51 లక్షల రూపాయల వడ్డీ లేని రుణాలను పంపిణీ చేయనున్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తో పాటు అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిఆర్డిఓ మేన శ్రీను, గృహ నిర్మాణ శాఖ పీడీ హరికృష్ణ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మహేందర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాజీపేట డివిజన్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, పరకాల మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఇతర అధికారులు, మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏకవీర ఎల్లమ్మ దేవాలయాన్ని సందర్శించిన వరంగల్ ఎంపీ కడియం కావ్య



వరంగల్ ప్రతినిధి, నవంబర్ 24,తరంగాలు : ఏకవీర ఎల్లమ్మ ఆలయ పునరుద్ధరణకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవడం తో పాటు ఇందుకు అవసరమైన నిధుల మంజూరు కొరకు కృషి చేస్తామని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15 వ డివిజన్ పరిధి మొగిలిచర్ల లో ప్రసిద్ధి చెందిన ఏకవీర ఎల్లమ్మ దేవాలయాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి,జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులు అర్జున్ రావు, లతో కలిసి వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య క్షేత్ర స్థాయిలో ఆలయ నిర్మాణ వైశిష్ట్యం, పురాతన శైలి, శిల్పకళ వంటి అంశాలను పరిశీలించి, ఆలయ పునరుద్ధరణకు అవసరమైన చర్యలను తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపి డా. కడియం కావ్య మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి మంజూరు చేయిస్తామన్నారు. రానున్న 100 సంవత్సరాల దృష్టిలో ఉంచుకొని అందుకు అవసరమైన మాస్టర్ ప్లాన్ ను రూపొందించుకొని ఆలయానికి అనుబంధంగా పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని అదనంగా తీసుకొని అందులో గార్డెనింగ్ ల్యాండ్ స్కేపింగ్ చేయాలని అన్నారు. గతం లో సుమారు 30 విగ్రహాలను ఆలయ ఆవరణ లో ఏర్పాటు చేయడం జరిగిందని, వాటికి పీఠాలు ఏర్పాటు చేసి అమర్చడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ అక్కడ ఉన్న రాతిని తొలిచి నిర్మించిన గుహలతో పాటు ఇటీవల గ్రామం నుండి సేకరించిన శిల్పాలు శాసనాలు ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని కలియ తిరిగి పరిశీలించారు. ఈ కార్యక్రమం లో కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులు అర్జున్ రావు, ఆర్కియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ బుజ్జి, డి ఆర్ ఓ విజయలక్ష్మి జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ , టార్చ్ అరవింద్ ఆర్యా తదితరులు పాల్గొన్నారు.

# అమీనాపురంలో తాళం వేసి ఉన్న ఇండ్లలో చోరీ..





కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్.24, తరంగాలు: తాళం వేసి ఉన్న ఇండ్లలో చోరీ జరిగిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే కేసముద్రం ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన కథనం ప్రకారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధి అమీనాపురం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి ప్రాంతాన బట్టు సుధాకర్ , వేల్పుగొండ ఏలియా ఇండ్లలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి బంగారం, వెండితో పాటు నగతు రూ. 10 వేలు ,రూ. 1. 20 లక్షల విలువ గల వస్తువులు దుండగులు దొంగిలించారని బాధితుల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపారు.

# ప్రైవేట్ ఆస్పత్రులు ఆకస్మికంగా తనిఖీ

## - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రవి రాథోడ్



మహబూబాబాద్, నవంబర్ 24, తరంగాలు మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రవి రాథోడ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ బృందం సోమవారం ప్రైవేట్ వైద్య సంస్థలపై విస్తృత తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా వెన్నెలా హాస్పిటల్, అమృత హాస్పిటల్ (మహబూబాబాద్) మరియు అర్జున్ డయాగ్నొస్టిక్ సెంటర్ (బయ్యారం)లను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా ఆస్పత్రుల్లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రెగ్యులేషన్ & రిజిస్ట్రేషన్) యాక్ట్ - 2010 అమలు పరిస్థితిని వివరంగా పరిశీలించగా, యాక్ట్‌లో పేర్కొన్న కనిష్ట ప్రమాణాలు, నమోదు, సిబ్బంది అర్హతలు, రోగి రికార్డుల నిర్వహణ, పరికరాల ప్రమాణాలు, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై ఆసుపత్రి నిర్వాహకులకు స్పష్టమైన సూచనలు జారీ చేయబడాయి. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వహకులకు కఠినంగా హెచ్చరిస్తూక్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ 2010 ను తప్పనిసరిగా అమలు చేయాలి. రోగి భద్రత, సేవల నాణ్యతపై ఎటువంటి రాజీ ఉండకూడదు. కనిష్ట ప్రమాణాలు పాటించనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని అని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన తెలిపారు.



# నూతన ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



నల్గొండ ఆర్సీ, నవంబర్ 24.తరంగాలు: వాడపల్లి ఎస్సై శ్రీకాంత్ రెడ్డిని సోమవారం తేజ వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వాడపల్లి ఎస్సై శాంతి భద్రతలను పరిరక్షించడంలో ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. దామర చర్ల మండలం గణేష్ పహాడ్ గ్రామానికి ఇరువైపులా ఉండే రెండు క్వారీల నుండి పొంచి ఉన్న ప్రమాదం నుండి గ్రామస్తులను ఆయన కాపాడుతున్నారని అన్నారు. క్వారీకి వెళ్లే దారిలో ఇద్దరు గార్డులను పెట్టారని అన్నారు. ఆడపిల్లలకు సంబంధించి మహిళలకు సంబంధించి అనేక అవగాహన సదస్సులు నిర్వహించారని అన్నారు. ఎస్ఐ భవిష్యత్తులో కూడా అనేక సామాజిక కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధు,సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ లో చేరిన నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం

తరంగాలు, వరంగల్ ప్రతినిధి, నవంబర్ 24: రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ అధ్యక్షులు మదూరి గణేష్ ఆధ్వర్యంలో రత్న హోటల్ నందు రోటరీ క్లబ్ కుటుంబ సభ్యుల మధ్య కొత్తగా సభ్యులైన డా. అవినాష్ ,క్యాన్సర్ స్పెషలిస్ట్ డా. సుజీత్ ఆర్ఎంవో మొలుగు వ్యాపారస్తులు శ్రవణ్ కుమార్ ,పొట్టి రాజేష్ ,వారికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ శరత్ బాబు,మాదూరి గణేష్ ప్రమాణస్వీకారం తో పాటు రోటరీ పిన్ అందిస్తూ ఫ్రెండ్షిప్ ఫెలోషిప్ అండ్ సర్వీస్ అనే ' నినాదంతో 120 సంవత్సరాల క్రితం ప్రారంభమైన రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ వివిధ రంగాలలో సేవా కార్యక్రమాలు చేస్తూ అందరికీ ఆదర్శవంతంగా నిలబడింది. ప్రపంచం మొత్తం 1.4 (14 లక్షల మంది) మిలియన్ మెంబర్షిప్ తో ప్రజలకు సేవా కార్యక్రమాలు .. డిసైజ్ ప్రెవేన్షన్ లో భాగంగా ప్రపంచానికి పోలియో ని ఎరాడికేట్ చేయడంలో రోటరీ క్లబ్ కీలక పాత్ర పోషించింది.. ప్రపంచం నుంచి పోలియో మహమ్మారి దూరమవడంలో రోటరీ యొక్క కృషి మర్చిపోలేనిది. పోలీయ్ ఏరాడికేషన్ కోసం ప్రపంచవ్యాప్తంగా 2011 వరకే దాదాపుగా ఒక బిలియన్ డాలర్ల రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ ఖర్చు చేయడం జరిగింది.1988లో 225 దేశాలలో ఉన్న పోలియో ఇప్పుడు కేవలం రెండు దేశాలకే పరిమితం లో రోటరీ పాత్ర తన ... వివిధ రంగాలలో రోటరీ క్లబ్ సభ్యులు ప్రపంచవ్యాప్తంగా చేస్తున్న సేవలు నిజంగా ఎంతో అభినందనీయం.కోవిడ్ నియంతనలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలలో రోటరీ క్లబ్ సేవలు అందించింది.భారతదేశంలో కూడా దాదాపు గా 350 కోట్ల రూపాయల వరకు కోవిడ్ నివారణలో భాగంగా సహాయం చేయడం జరిగింది. దేశంలో వివిధ ప్రాంతాలలో ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లు ఎన్నో పేద ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఇచ్చి వారి ప్రాణాలను నిలపడంలో రోటరీ క్లబ్ ఎంతో సేవ చేసింది.మన వరంగల్ పట్టణంలో కూడా మన ఈ క్లబ్ రోటరీ క్లబ్ అఫ్ వరంగల్ సెంటర్ రొటీరియన్లు ఎంతో ముందుకు వచ్చి 25 ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లు డాక్టర్ శరత్ బాబు ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉంచింది వారి ప్రాణాలు కాపాడడంలో కృషి చేసింది.ఇదే కాకుండా ఎన్నో గ్లోబల్ గ్రాంట్స్ ద్వారా పేద ప్రజలకు విద్యా,వైద్యం మరియు శానిటేషన్ ఇలాంటి ప్రథమ హక్కులను అందించడంలో రోటరీ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుంది.. వరంగల్ సెంట్రల్ వారు విజన్ సెంటర్స్ మొదలుపెట్టి



భూపాలపల్లి జనగాం జిల్లాలో ఉచిత కంటి నిర్ధారణలు మరియు అనుకూలమైన చికిత్సలు చేస్తున్నారు. పేద ప్రజల కోసం స్వచ్ఛమైన నీరు కోసం వాటర్ ప్లాంట్స్ నిరుపేదలైన ప్రజలకు స్వయం ఉపాధి కోసం కుట్టు మిషన్లు ప్రభుత్వ స్కూళ్లలో చదువుకుంటున్న ఆడపిల్లలకి సైకిల్స్ గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం కోసం ప్రోటీన్ పౌడర్స్ మరియు రాబోవు రోజుల్లో ఎంజిఎం హాస్పిటల్ నందు నెలలు నిండని ఆంగా వైకల్యంతో పుట్టిన పిల్లలకు నూతన ఎక్విమెంట్ (ఎన్ ఐసీయూ) రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ ద్వారా ఉచితంగా అందిస్తూ అమెరిక నుండి డాక్టర్స్ వచ్చి ఇక్కడ ఉన్నవారికి ఒక నెల రోజుల పాటు ట్రైనింగ్ ఇచ్చి పిల్లలు చనిపోకుండా ఉండేవిధంగా శిక్షణ ఇవ్వబడుతుంది.అలాగే ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహించుచున్నాము. ఈ కార్యక్రమంలో నూతనంగా వరంగల్ అర్బన్ కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్లు గా మా క్లబ్ సభ్యులు ప్రముఖ న్యాయవాది చకిలం ఉపేందర్ ,తోట జగన్నాథం ,పొన్న హరినాథ్, వద్నాల సదానందం ఎన్నుకోబడిన వారిని ఈ కార్యక్రమంలో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోరే చంద్రమౌళి ,బేతి అశోక్ బాబు , జూలూరి కృష్ణమూర్తి తోట సంపత్ ,బండారి కుమారస్వామి ,రాజేందర్ కిరణ్, పోరండ్ల రత్నాకర్, ప్రసాద్, రవీందర్, వినయ్ , దేవమహేందర్ ,చిన్నాల సత్యనారాయణ, బేతిశంకరయ్య, వేణు, తోట శివకుమార్, రోటరీ మిత్రులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# కోటి మంది మహిళలకు కోటి చీరల పంపిణీ

- మహిళా ఉన్నతే.. సమాజ ప్రగతి.. దేశ పురోగతి
- మహిళలే దేశ నిర్మాతలు.. మార్గదర్శకులు
- వారు బలంగా ఉంటేనే.. జాతి నిర్మాణపు పునాదులు బలంగా ఉంటాయి
- మహిళా సంఘాల్లో చేరేలా మహిళలను ప్రోత్సహించాలన్న సీఎం రేవంత్ రెడ్డి



వర్ధన్నపేట ప్రతినిధి, నవంబర్ 24, తరంగాలు : మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని కోటి మంది మహిళలను కోటీశ్వరాలను చేయడమే మా ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్న వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు వర్ధన్నపేట మండల పరిధిలోని నల్లబెల్లి గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులకు చీరలను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలే దేశ నిర్మాతలు.. మార్గదర్శకులు అని,వారు బలంగా ఉంటేనే.. జాతి నిర్మాణపు పునాదులు బలంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పార్టీ అధ్యక్షుడు తాటికాయల దిలీప్, ఇల్లంద మార్కెట్ కమిటీ డైరక్టర్ మల్యాల దేవేందర్, ఇందిరమ్మ కమిటి సభ్యులు అంబాల యాకాంత, పూర్గుజ్జ కవిత, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు బిర్రు రాజు, సీనియర్ నాయకులు జక్కి గోపాల్, బిర్రు సురేందర్, మరుపట్ల ప్రశాంత్, బిర్రు దిలీప్, ఎం.డి జాఫర్, బిర్రు గోపాల్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బిర్రు మధు, యూత్ కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆర్రేలి నాగరాజు, అధికారులు ఏపీఏం రమణాచారి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.కె హుస్సేన్, సిసి పిన్నింటి రేణుక, వివోఏ బిర్రు దయాకర్, కొండేటి సుమన్, తాటికాయల లావణ్య, ఆకారపు అనిత, వివో అధ్యక్షులు నిమ్మానీ కల్పన, దొమ్మటి స్వాతి, ఆకారపు వసంత, మహిళ సంఘం సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీల సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 159 అర్జీలు





హనుమకొండ ప్రతినిధి, నవంబర్ 24, తరంగాలు : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశపు హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిలకు అర్జీలను అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులను ప్రజలు అందించిన అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో గృహ నిర్మాణ, మున్సిపల్, రెవెన్యూ, డి ఆర్ డి ఓ, వ్యవసాయ, ఉపాధి కల్పన, ఇతర శాఖలకు సంబంధించి స్వీకరించిన 159 సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించి త్వరితంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, డిఆర్డిఓ మేన శ్రీను, హనుమకొండ,పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, పలువురు తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హన్మకొండ ప్రతినిధి, నవంబర్ 24,తరంగాలు : హసన్పర్తి మండల కేంద్రంలోని టిటిఎస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ న వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రారంభించారు. అనంతరం ఎక్సైజ్ స్టేషన్ సీఐ దుర్గాభవానిని కుర్చీలో కూర్చోబెట్టి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. తదనంతరం ఈ స్టేషన్ పరిధిలో వచ్చే ప్రాంతాలను అధికారాలలను అడిగి తెలుసుకుని డ్రగ్స్, గంజాయి, గుడుంబా వంటివి లేకుండా నిర్మూలించాలని ఎక్సైజ్ అధికారులకు సూచన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ హాసన్పర్తి టౌన్ లో ఎక్సైజ్ స్టేషన్ ఏర్పాటుకు చేసేందుకు సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు కు కృతజ్ఞతలు తెలుపుతున్నానని, తెలంగాణను డ్రగ్స్ ఫ్రీ స్టేట్ గా చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి అహర్నిశలు కష్టపడి పని చేస్తున్నారని, విద్యార్థులు, యువత మత్తును వదిలి మైదానాల్లోకి రావాలని, గంజాయి, మత్తుపదార్థాల వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని, యువత వాటికి దూరంగా ఉండాలన్నారు. తాను అడిషనల్ డీసీపీ, నిజామాబాద్ సీపీగా ఉన్నప్పుడు ప్రత్యేక టీమ్స్ వేసి మత్తు పదార్థాల నివారణకు కృషి చేశామని చెప్పారు. మత్తు పదార్థాల నివారణకై ప్రభుత్వం ప్రత్యేకంగా ఈగల్ టీంను ఏర్పాటు చేసిందని, ఎక్సైజ్ అధికారులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా మత్తు పదార్థాల నివారణకు కృషి చేయాలని అన్నారు. హసన్పర్తి సమీపంలో అనేక కళాశాలలు ఉన్నాయని, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, ఎక్సైజ్ అధికారులు అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ డ్రగ్స్, మత్తు పదార్థాల నివారణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి, ఆత్మకూర్ ఏఎంసి వైస్ చైర్మన్ తంగెళ్ళపల్లి తిరుపతి, ఐనవోలు ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, హాసన్పర్తి మండల పార్టీ అధ్యక్షులు పోరెడ్డి మహేందర్ రెడ్డి, పాక్స్ చైర్మన్ చల్లా గోపాల్ రెడ్డి, 66వ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, మండల మహిళ అధ్యక్షురాలు జోరిక పూలక్క, బత్తుల స్వాతి, సీనియర్ నాయకులు కార్యకర్తలు మరియు ఎక్సైజ్ వరంగల్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు, ఎక్సైజ్ డిపిఓ వరంగల్ అర్బన్ చంద్రశేఖర్, స్థానిక ఎక్సైజ్ సిఐ దుర్గా భవానీ, ఎస్ఐ వెంకన్న, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.









# రాజ్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ని మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది



తరంగాలు, జూబ్లీహిల్స్, నవంబర్ 24 : జూబ్లీహిల్స్ నియోజకవర్గ శాసనసభ్యులు వల్లాల నవీన్ యాదవ్ ఈ రోజు రాజ్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయ కేథనం ఎగురవేసి జూబ్లీహిల్స్ నూతన శాసనసభ్యులుగా ఎన్నికైన వల్లాల నవీన్ యాదవ్ ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభినందించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తో పాటు బీ.సీ.జేఏసీ చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్ రమేష్ యాదవ్ .వాసు .దీపక్ చక్రి .తదితరులు పాల్గొన్నారు.

# సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు వారికి అప్పగించిన ఆర్మూర్ సిఐ



తరంగాలు, ఆర్మూర్, నవంబర్ 24 : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ బాధితులు సీఈఐఆర్ పోర్టల్ నమోదు చేసుకోగా వాటిని పోయినటువంటి మొబైల్ ఫోన్లను సి.ఈ.ఐ.ఆర్ పోర్టల్ ద్వారా సేకరించి బాధితులకు (04) మొబైల్ ఫోన్ లను అప్పగించబడినదని ఆర్మూర్ సిఐ సత్యనారాయణ గౌడ్ అప్పగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత వస్తువుల పట్ల జాగ్రత్తలు పాటించాలని ఈ సందర్భంగా ప్రజలకు తెలియజేశారు.

# గుండ్ల చెరువులో చేప పిల్లలను విడుదల చేసిన ఎమ్మెల్యే



తరంగాలు, ఆర్మూర్, నవంబర్ 24 : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని సోమవారం రోజున గుండ్ల చెరువు వద్ద 100 శాతం సబ్సిడీపై చేప పిల్లల విడుదల చేశారు ఈకార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తోపాటు, పట్టణ గంగపుత్ర సంఘం సభ్యులు, కలిసి చేప పిల్లలను చెరువులో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే తో పాటు బిజెపి పార్టీ సీనియర్ నాయకులు పార్టీ కార్యకర్తలు, అధికారులు గంగాపుత్ర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

Printed,Published by,Owened by **GADDAM NAGARAJU &** Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad **RNI. NO TELTEL/2022/83463 &** Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
**EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com**